క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయంలో వంద శాతం ఉత్తీర్ణత

గుత్తి: సీబీఎస్‌ఈ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు గుత్తి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మల్కీ సాబ్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టెన్త్‌లో 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారన్నారు. అలాగు ఇంటర్‌లో 18 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. టెన్త్‌లో అంషల్ కుమార్ మీనా 500 మార్కులకు గాను 420 మార్కులు, జ్యోతి కుమారి 412 మార్కులు, చౌదరి హుమేరా 411 మార్కులు సాధించారన్నారు. అదే విధంగా ఇంటర్‌లో భవ్యరాజ్ 500 మార్కులకు గాను 417 మార్కులు, పూజిత 404 మార్కులు, పవనశ్రీ 391 మార్కులు సాధించారన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న మహిళ

నార్పల: అమరవీరులు గాండ్ల సుబ్బయ్య, మురళి నాయక్ జ్ఞాపకార్థంగా మండల కేంద్రంలోని కాఫీ టైంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమంలో అమరవీరుడు సుబ్బయ్య సతీమణి లీలావతి పాల్గొని సుబ్బయ్య, మురళి నాయక్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిబిరంలో 123 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరికీ రెడ్‌క్రాస్ తరపున ప్రశంసా పత్రం అందజేయడంతో పాటు ఒక సంవత్సరానికి రూ.లక్ష ప్రమాద బీమా చేశారు. కార్యక్రమంలో గవ్వల శివ, బూసి దిలీప్, రాయల్ దిలీప్, ఎట్టి తిరుపాల్, అశోక్, సైపుల్లా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

గుంతకల్లుటౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ) గుంతకల్లు తాలూకా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పాతగుత్తిరోడ్డులోని కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు.

ముగిసిన హజరత్ బందే నవాజ్ ఉరుసు



జియారత్ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కర్నూల్ రోడ్డులో ఉన్న హజరత్ బందే నవాజ్ దర్గాలో ఉరుసు ఉత్సవాలు శుక్రవారం జియారత్‌తో ముగిశాయి.

బుధవారం నుంచి దర్గా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. చివరి రోజు జియారత్ ఘనంగా నిర్వహించారు.

సూపర్‌వైజర్ల బదిలీలు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్ల బదిలీలు జరిగాయని శుక్రవారం సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. పట్టణంలోని ఆస్పత్రి, తాడిపత్రి రూరల్ సెక్టార్లకు లక్ష్మీదేవి, పట్టణంలోని అంబేడ్కర్ సెక్టార్‌కు రామలక్ష్మి, తాడిపత్రి మండలం చుక్కలూరు సెక్టార్‌కు నారాయణమ్మ, ఆర్‌వీపల్లి సెక్టార్‌కు విజయకుమారి, పెద్దపప్పూరు, ముచ్చుకోట సెక్టార్‌లకు దస్తగిరిమ్మ, యాడికి, నిట్టూర్ సెక్టార్లకు విజయ, రాయలచెరువు సెక్టార్‌కు షంషాద్, పెద్దవడుగూరు సెక్టార్‌కు కల్పనలను బదిలీ చేశామన్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో గంగమ్మ తల్లి

పామిడి: పట్టణంలోని వెంగమనాయుడు కాలనీలో శుక్రవారం గంగమ్మతల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు భక్తిప్రపత్తులతో ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు. అంతకుముందు రెండురోజులుగా నిర్వహిస్తున్న ఈకార్యక్రమాల్లో స్వస్తి పుణ్యవచనం, అవాసపూజలు, గణపతి, నవగ్రహ, దుర్గ హోమాలు చేశారు. అమ్మవారికి గ్రామోత్సవం చేశారు.

జేసీ ఇలాకాలో దాహం కేకలు

- ఎస్సీ కాలనీలో వేధిస్తున్న తాగునీటి సమస్య
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పొలంలోని బోరు వద్ద తాగునీరు నింపుకుంటున్న ఎస్సీ కాలనీ వాసులు



పొలాల్లో నుంచి బిందెలతో నీరు మోసుకొస్తున్న చిన్నారులు

తాడిపత్రిటౌన్: జేసీ ఇలాకాలో తాగునీటి సమస్య వేధిస్తోంది. తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి గ్రామం పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. మైక్ పట్టుకుంటే నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారమే ప్రధానంగా పనిచేస్తామని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తరచూ చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదు. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లిలో ఓ వైపు తాగునీరు వృథా అవుతూ మురుగు సమస్యలు నెలకొంటే .. అదే గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం కాలనీవాసులు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలో దాదాపు 280 ఇళ్లు ఉండగా ఎస్సీ కాలనీలో 130 ఇళ్లు వున్నాయి. గ్రామంలో 1200 జనాభా ఉండగా 860 మంది ఓటర్లు ఉన్నారు. గ్రామంలో ఓ సామాజిక వర్గం ప్రజలు ఎక్కువగా ఉండడంతో .. ఆ సామాజిక వర్గానిదే గ్రామంలో పెత్తనం. తాగునీటి బోరు మరమ్మతులకు గురవవడంతో దాదాపు వారం రోజులుగా కాలనీలో నీరు రాక.. కాలనీవాసులు సమీప పొలాల వైపు నీటి కోసం పరుగులు పెడుతున్నారు. వేసవి కావడంతో చిన్నాపెద్దా తేడా లేకుండా పనులు మానుకొని నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పాడిపశువులపై ఆధారపడ్డ కుటుంబాల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. నీరు లేక కాలనీవాసులు ఆపసోపాలు పడుతున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు కానీ పాలకులు కాని ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అదే గ్రామంలో తాగునీరు అవసరం లేకున్నా ట్యాంకులు నిండి పొర్లి పారుతున్నారు. నిత్యం నీరు వృథా అవుతుండటంతో ట్యాంకు పరిసరాలు మురుగుతో అపరిశుభ్రంగా మారాయి. అధికారులు స్పందించి గ్రామంలో మురుగునీటి సమస్య, ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి కోసం ఇబ్బంది



తాగునీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామంలో నీరు వస్తున్నా... మా కాలనీలో చుక్క నీరు లేదు. పనులు మానుకుని తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం.

– రమాదేవి,
ఎస్సీ కాలనీ, సోమనపల్లి

దాహం తీర్చండి సారూ..



దాదాపు వారం రోజులుగా తాగునీరు లేక నరకయాతన పడుతున్నాం. నీరు లేక పోవడంతో ఎండలకు మూగ జీవాలు అలమటిస్తున్నాయి. అధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలి.

వెంకటప్ప,
ఎస్సీ కాలనీ, సోమనపల్లి

సమయపాలన పాటించని సిబ్బంది



ఉదయం పది గంటలవుతున్నా తెరుచుకోని లక్ష్మంపల్లి సచివాలయం

పెద్దవడుగూరు: ప్రజల వద్దకే పరిపాలన అందించాలనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని స్థాపించారు. అప్పటి నుంచి ప్రజలు సంక్షేమ పథకాలను సచివాలయాల ద్వారా అందుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం సంక్షేమ పథకాలు అందక, అరకొరగా వస్తున్న పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీనిని అలుసుగా తీసుకున్న సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టం వచ్చినట్లు హాజరు వేసుకుంటూ విధులకు డుమ్మా కొడుతున్నారు. సర్టిఫికెట్ల కోసం, రేషన్ కార్డుల్లో మార్పుల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఉద్యోగులు ఎవ్వరూ సక్రమంగా సమాచారం ఇవ్వకపోవడంతో నిరుత్సాహంగా వెను తిరిగి వెళ్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టాను సారంగా విధులకు హాజరు అవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విధులకు సక్రమంగా హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

టీడీపీ కేడర్‌లో అసంతృప్తి



నారా లోకేష్‌ను కలవడానికి వచ్చిన కేడర్‌ను అడ్డుకుంటున్న సెక్యూరిటీ

గుత్తి: గుత్తిలో నారా లోకేష్ పర్యటన టీడీపీ కేడర్‌కు అసంతృప్తిని మిగిల్చింది. గుత్తి మండలం బేతాపల్లిలో సోలార్ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం గుత్తికి వచ్చారు. గుత్తిలో రెండు రోజుల పాటు ఉన్నారు. గురువారం టీడీపీ కేడర్‌తో సమావేశాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం బేతాపల్లిలో సోలార్ ప్రాజెక్టుకు శంకు స్థాపన చేశారు. అనంతరం గుత్తిలోని మాసినేని పాఠశాలకు ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యకర్తల సమావేశంతోపాటు ప్రజా దర్బార్‌లో నారా లోకేష్‌ను కలవడానికి వచ్చిన చాలా మందికి అనుమతి ఇవ్వలేదు. దీంతో కేడర్ పూర్తిగా అసంతృప్తికి గురైంది. సీనియర్ నాయకులు సైతం నారా లోకేష్‌ను కలవలేక వెనుతిరిగారు. కాగా ప్రజా దర్బార్ కార్యక్రమంలో గుత్తిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని లోకేష్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. అలాగే చిన్న వయస్సులోనే 117 మొక్కలు నాటి సంరక్షించిన గుత్తి కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి చదువుతున్న సుంకర నవనిని నారా లోకేష్ అభినందించారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



యాడికి మండలం రాయలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు దేవరాజ్, అప్పయ్య



గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

యాడికి/గార్లదిన్నె/యల్లనూరు: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైద్యులు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డెంగీ, మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల్లో చెత్త, చెదారం, మురుగు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు.

- యాడికి మండలంలోని రాయల చెరువు, యాడికి పీహెచ్‌సీలలో శుక్రవారం వైద్యాధికారులు దేవరాజు, అప్పయ్య, సుమంత్ రెడ్డి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో డెంగీ వ్యాధిపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, కార్యక్రమంలో సీహెచ్‌ఓ జుబేదా, ఎంపీహెచ్‌ఈఓ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ మంజుల మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- యల్లనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలోలో శుక్రవారం వైద్యాధికారులు కీర్తన, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణమ్మ వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతి మృతి

తాడిపత్రి: అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ తక్కల్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనరసమ్మ అనే యువతి శుక్రవారం మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. తక్కల్లపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి తన కుమార్తె లక్ష్మీనరసమ్మ (18)కు స్కూటీని నేర్పుతుండగా చల్లవారిపల్లి వద్దకు రాగానే ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఘటనలో తల్లి విజయలక్ష్మికి గాయాలవగా, కుమార్తె లక్ష్మీనరసమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం లక్ష్మీనరసమ్మ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ



చెల్లాచెదురుగా పడిన గొర్రెల కళేబరాలు

గుత్తి రూరల్: మండలంలోని 44వ జాతీయ రహదారిపై గొర్రెల మందపై లారీ దూసుకెళ్లిన ఘటనలో 24 గొర్రెలు మృతి చెందాయి. మరికొన్ని గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. గుత్తి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కాపరులు రాముడు, నారాయణస్వామి, శివశంకర్ శుక్రవారం తమ గొర్రెలను మేపునకు తోలుకెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనతో రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరులు వాపోయారు. ఊబిచెర్ల గ్రామ శివారులో 44వ జాతీయ రహదారికి పక్కన వెళుతున్న గొర్రెల మందపై హైదరాబాదు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న లారీ దూసుకెళ్లింది. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని లారీతో పాటు పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నపాటి వర్షానికే రోడ్డు జలమయం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గుంతకల్లు టౌన్: పట్టణంలోని అల్లీపీరా ఆర్చ్ వద్ద ఉన్న సీసీ రోడ్డు చిన్న నీటి కుంటగా మారింది. రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే నీరంతా రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. గత కొన్ని నెలలుగా అధ్వాన్నమైన పరిస్థితి నెలకొన్నా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదాల బారి నుంచి రక్షించేందుకు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



మండల నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోని శివాలయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సోమశేఖర్‌రెడ్డి వివాహానికి ఆయన హాజరయ్యారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తానన్నారు. ఎవరూ భయపడవద్దని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



ఎంపీటీసీ నారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: మండలంలోని సోమనపల్లి ఎంపీటీసీ గత కొద్ది రోజులుగా శ్వాస కోశ సంబంధిత వ్యాధితో మంచానపడ్డారన్న విషయం తెలుసుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఇంటికి తీసుకువచ్చామని, ఆక్సిజన్ సాయంతా ఆయన జీవిస్తున్నారని కుటుంబసభ్యులు బోరుమన్నారు. పార్టీ తరపున ఉంటుందని కేతిరెడ్డి వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, ధర్మాపురం సర్పంచు రమేష్‌నాయుడు, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షుడు యోగీశ్వర్‌రెడ్డి, అశ్వర్థం ఆలయ మాజీ ధర్మకర్త చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, రామచంద్రారెడ్డి, రంగేశ్వర్ రెడ్డి, నాగలింగేశ్వర్ రెడ్డి, గోవిందు, రామాంజుల రెడ్డి, నాగిరెడ్డి, అమర్‌నాథరెడ్డి, రాంబాబు, అశోక్, గంగరాజు, నాగరాజు, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న కిశోర బాలికలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని టైలర్స్ కాలనీలోని ఆర్‌పీజీ స్కూల్ ఆవరణలో శుక్రవారం కిశోర బాలికలకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. కిశోరి వికాసం కింద పోటీలను నిర్వహించామని సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. కిశోరి బాలికలకు మానసిక ఉల్లాసంలో భాగంగా కబడ్డీ, ఖోఖో పోటీలతో పాటు మగ్గం వర్క్‌లను నేర్పించామన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామని సీడీపీఓ తెలిపారు. పోటీలను కౌన్సిలర్ హుస్సేన్‌బాషా, ఏఎన్ఎం, ఎంఎస్‌కే, అంగన్‌వాడీ టీచర్లు పర్యవేక్షించారు.

ఏఈ బాధ్యతల స్వీకరణ

యల్లనూరు: మండల విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంలో పని చేస్తున్న సబ్ ఇంజనీరు పద్మనాభరెడ్డి ఇన్‌చార్జ్ ఏఈగా బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏఈ రవీంద్రను వైఎస్సార్ జిల్లా కేంద్రానికి బదిలీ చేశారు. నూతన ఏఈ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు.



వాహనాల రాకపోకలు నిలిచిన దృశ్యం

ట్రాఫిక్ కష్టాలు..

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ట్రాఫిక్ కష్టాలతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న దుకాణాల యజమానులు, తమ దుకాణాల వద్ద వాహనాలు నిలుపు ప్రదేశం లేకపోవడం తో రహదారి పైనే వాహనాలు ఆపి వ్యాపారాలు చేస్తున్నారు. దీనికి తోడు బస్టాండు ప్రాంగణం వద్ద ఉన్న యూనియన్ బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు వాహనాలు నిలుపుకోవడానికి స్థలం లేకపోవడంతో.. వాహనాలు రోడ్డుపైనే వదిలేసి బ్యాంకులో పనులకు వెళ్తున్నారు. దీంతో అనంతపురం నుంచి యాడికి, తెలికి, పామిడి నుంచి తాడిపత్రి పట్టణాలకు వెళ్లే బస్సులు వచ్చినప్పుడు ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఏదైనా పెద్ద వాహనాలు ఎదురైతే ఎటూ పోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తుప్పుపడుతున్న ద్విచక్ర వాహనాలు

వాహనాలకు తుప్పు..

తాడిపత్రి రూరల్: పట్టణ పోలీసులు రికవరీ చేసిన ద్విచక్రవాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. పట్టణ, పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు గురైన వాహనాలను పోలీసులు రికవరీ చేశారు. వాటికి సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉండటం, ద్విచక్రవాహనాలకు సంబంధించిన యజమానులు ట్రేస్ అవుట్ కాకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. పట్టణ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న అర్ధంతరంగా నిలిచిపోయిన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్మాణం వద్దఉంచారు. సంవత్సరాల తరబడి వాహనాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. వీటిని వేలం వేయడానికి పలు నిబంధనలు అడ్డు వస్తుండటంతో పోలీసు అధికారులు సైతం ఏం చేయలేకపోతున్నారు. ఆలోపు వాహనాలు ఎందుకూ పనికిరాకుండా పోయే అవకాశముందని వాహనదారులు వాపోతున్నారు.

అధ్వానంగా రహదారి



నిలువురాయి వద్ద ఏర్పడిన గుంతలు

శింగనమల: శింగనమల నియోజకవర్గంలోని చక్రాయిపేట నుంచి చాములూరు–నిలువురాయి–నార్పల మధ్యన ఉన్న రోడ్డు గుంతలమైంది. రోడ్డు గుంతలు పడడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేయించి, రోడ్డు మరమ్మతులకు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.